నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

- బస్టాండ్‌లోకి రాని బస్సులు
- రోడ్లపై నిలబడలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులను రోడ్డుపైనే నిలుపుతుండటంతో ప్రయాణికులు రోడ్డుపై నిలబడలేక ఆందోళన చెందుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

మూడు కిలోమీటర్ల దూరం వెళ్తేనే..

తిరుమలగిరిలో నిర్మించిన బస్టాండ్ ఏళ్ల తరబడి నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ప్రయాణికుల కోసం పాత గ్రామంలో మున్సిపల్ కార్యాలయం పక్కన లక్షలు వెచ్చించి బస్టాండ్ నిర్మించారు. సూర్యాపేట-జనగామకు వెళ్లే బస్సులు మాత్రమే తిరుమలగిరి పాత గ్రామంలోని రోడ్డుపైన నిలుస్తున్నాయి. తొర్రూర్-మోత్కూరు, హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు స్థానిక క్రాస్ రోడ్డు నుంచే వెళ్తున్నాయి. పాత గ్రామంలోని బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో తిరుమలగిరి గ్రామంలోని ప్రజలు, నందాపురం, తాటిపాముల గ్రామాల ప్రజలు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎక్స్ రోడ్డు వద్దకు వెళ్లి బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.


తిరుమలగిరిలో ఉపయోగంలో లేని బస్టాండ్

అదనపు భారం..

దూర ప్రాంతాలకు వెళ్లాలంటే తిరుమలగిరి గ్రామస్తులు ఆటోల్లో ఒక్కొక్కరికి పోవడానికి రూ.పది, రావడానికి రూ.పది వెచ్చించి ఎక్స్ రోడ్డు వద్దకు వెళ్లి బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. డబ్బులు లేని ప్రయాణికులు స్థానిక చౌరస్తా వరకు మూడు కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో క్రాస్ రోడ్డులో దిగిన ప్రయాణికులు గ్రామంలోకి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడు గంటల తర్వాత ఆటోలు కూడా ఉండవు. దీంతో రాత్రివేళ నడుచుకుంటూ రావాలంటే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దూర ప్రాంతాలకు వెళ్లే కొన్ని బస్సులనైనా ఉదయం, సాయంత్రం వేళల్లో పాత గ్రామంలోని బస్టాండ్‌లోకి రప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



బస్టాండ్ నిర్మించి సంవత్సరాలు గడిచింది. పాత గ్రామంలోనే ఎక్కువ మంది ప్రజలు నివసిస్తున్నారు. కానీ ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఎక్స్ రోడ్డు వరకు నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఒక వేళ ఆటోలో వెళ్లాలంటే ఒక్కో ప్రయాణికుడు అదనంగా రూ.20 ఖర్చు చేయాల్సి వస్తోంది.

– జి.లింగయ్య, తిరుమలగిరి

వినియోగంలోకి తేవాలి

నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకరావాలి. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని అన్ని బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చూడాలి. ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి. – శ్రీనివాస్, తిరుమలగిరి

క్లుప్తంగా

ఎమ్మెల్యే సామేల్‌ను కలిసిన నాయకులు

తిరుమలగిరి : తుంగతుర్తి శాసన సభ్యులుగా నూతనంగా ఎన్నికైన మందుల సామేల్‌ను తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామానికి చెందిన పలువురు నాయకులు సోమవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకులు డానియల్, జంపాల సత్తయ్య, వెంకన్న, రాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పైప్‌లైన్ లీకేజీ.. నీరు వృథా


బురదమయంగా మారిన దారి

తుంగతుర్తి : కొత్తగూడెంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతూ దారి బురదమయంగా మారింది. గత రెండు నెలలుగా నీరు వృథాగా పోతున్నా మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ దారి గుండానే ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి వాహనాలు నిత్యం వెళ్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కారు ఢీకొని గేదెకు గాయాలు

నాగారం : సూర్యాపేట-జనగామ జాతీయ రహదారిపై కారు ఢీకొని పాడిగేదెకు గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం డి.కొత్తపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వేల్పుల మధు సాయంత్రం తన గేదెను ఇంటికి తోలుకెళ్తున్నాడు. అదే సమయంలో నల్లగొండ జిల్లా కట్టంగూర్ గ్రామానికి చెందిన నోముల ప్రశాంత్ కారులో సూర్యాపేట నుంచి తిరుమలగిరి వైపు వెళ్తూ డి.కొత్తపల్లి శివారులో ఎదురుగా వస్తున్న పాడిగేదెను అతివేగంగా ఢీకొట్టాడు. దీంతో గేదెకు గాయాలయ్యాయి. గేదె పరిస్థితి విషమంగా ఉందని, ఈ గేదె విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని రైతు వాపోయాడు. కాగా కారు ముందుభాగంగా ధ్వంసమైంది.

ఫ్లెక్సీ చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న అమరారపు శ్రీనివాస్

చివ్వెంల : మండల పరిధిలోని గుంజలూరు గ్రామంలో సోనియాగాంధీ ఫ్లెక్సీని చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అమరారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో బీఆర్‌ఎస్‌కు చెందిన కొంతమంది సోనియాగాంధీ ఫ్లెక్సీలు చింపారని ఆరోపించారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, వారిపై కేసు నమోదు చేయడం లేదని ఆరోపించారు. వెంటనే కేసు నమోదు చేయాలని, లేకుంటే పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై ఎస్‌ఐ విష్ణుమూర్తిని వివరణ కోరగా కాంగ్రెస్ వారు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొలికొండ సైదులు, పెద్ది అంజయ్య, కోణకంచి శ్రీను, సుంకరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి

మద్దిరాల : మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన చెవిటి లింగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. దీంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ సోమవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా నాయకుడు రేట్నేని శ్రీనివాస్, హమీద్, వినోద్, రమేష్, నర్సయ్య, సురేష్, సూరి, మహేష్, తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతో అన్నదానం


కోదాడలోని అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న దాతలు

కోదాడఅర్బన్: కోదాడ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో మాలధారులకు సోమవారం పట్టణానికి చెందిన పబ్బతి రాధాకృష్ణమూర్తి, కుమారి దంపతులు, బద్దం భద్రారెడ్డి, కళావతి దంపతుల సహకారంతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి రామనాథం, గురుస్వాములు, ఆలయ కమిటీ సభ్యులు, దాతల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను తొలగించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భానుపురి : నల్లాల బావి ఏరియా నుంచి శివాలయం, రాజీవ్ నగర్ వెళ్లే ప్రజలకు ఇబ్బందిగా మారిన డివైడర్‌ను కొంతమేర తొలగించాలని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు స్థానిక మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ రహదారి గుండా వందలాదిమంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. డివైడర్ మధ్యలో జంక్షన్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతో వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి ఈ డివైడర్‌ను తొలగించారు. ఈ సమయంలో అక్కడికి చేరుకున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పాత జాతీయ రహదారి విస్తరణ అసంబద్ధంగా జరిగిందని, త్వరలోనే మెయిన్ రోడ్డు వ్యాపారస్తుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో బైరు శైలేందర్, పోలగాని బాలు గౌడ్, చంచల శ్రీనివాస్, ఆలేటి మాణిక్యం, రావుల రాంబాబు పాల్గొన్నారు.

ఏడు నెలలుగా అందని వేతనాలు


సమావేశంలో పాల్గొన్న వీఆర్‌ఏలు

అర్వపల్లి : వివిధ ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు అయిన వీఆర్‌ఏలకు ఏడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వీఆర్‌ఏల హక్కుల సాధన సమితి రాష్ట్ర కోచైర్మన్ దాసరి వీరన్న తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఉద్యోగ గుర్తింపు కార్డులను జారీ చేయకపోవడంతో జీతాలు అందడం లేదని అన్నారు. అలాగే సమ్మెకాలం 80 రోజుల వేతనం కూడా ఇవ్వలేదని చెప్పారు. 55 ఏళ్లు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. గుర్తింపు కార్డులు అందజేసి, పేస్కేల్ వేతనాలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బుంగ చరణ్‌రాజ్, బాలస్వామి, నర్సింహ, స్వామి, వీరస్వామి, వీరయ్య పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ బాలునాయక్

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని మండల విద్యాధికారి బి.బాలునాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన ప్రాథమిక స్థాయి పాఠశాలల కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్ల భాషా, గణిత సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యాశాఖ చేపట్టిన తొలిమెట్టు (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, అక్షరాలను గుర్తించడం తప్పనిసరి చేయాలన్నారు. అనంతరం ఇప్పటివరకు జరిగిన ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రగతి, అభ్యసన, అసెస్‌మెంట్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వాసం ప్రభాకర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పల్స వెంకన్న, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, డీఆర్పీలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు

- కుక్కడంలో స్వామివారిని దర్శించుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామచంద్రునాయక్ దంపతులు

మద్దిరాల : డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రునాయక్ కుక్కడం గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆయన సతీమణి ప్రమీలతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. వారికి కుక్కడం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దెల రాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు వరదాచార్యులు, ముక్కాల వాసుదేవరెడ్డి, మద్దెల వెంకట నర్సు, మద్దెల మల్లయ్య, ముక్కాల రామ్మూర్తి, వల్లపు వెంకన్న, మద్దెల నర్సయ్య, ముక్కాల సురేష్‌రెడ్డి, మద్దెల యాకయ్య, బింగి భిక్షపతి పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ తృతీయ వార్షికోత్సవాలు


జంగమేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నిర్వాహకులు, భక్తులు


విఘ్నేశ్వర పూజ చేస్తున్న అర్చకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామంలో శ్రీభవాని సమేత జంగమేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు సోమవారంతో ముగిసాయి. చివరి రోజున విఘ్నేశ్వర పూజ, చండీ రుద్రయాగం, రుద్రాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పర్సాయపల్లి గ్రామస్తులతోపాటు సమీప గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన రాచకొండ యాదగిరి, కన్నెబోయిన రామలింగయ్యలు దాదాపు 4వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు,భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక సోమవారం వేడుకలు



సూర్యాపేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

భానుపురి : సూర్యాపేట పట్టణ వ్యాప్తంగా కార్తీక మాసం చివరి సోమవారం సందడి నెలకొంది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో దేవాలయాలు కిటకిటలాడాయి. ప్రధానంగా జిల్లాకేంద్రంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివుడిని ప్రత్యేకంగా అలంకరించి త్రినేత్రుడిగా దర్శనం గావించారు. దీంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకల్లో రామలింగేశ్వరస్వామి ఆలయ పూజారి సతీష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

నూతనకల్ : కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని మండల పరిధిలోని గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునే పుణ్యస్నానాలు ఆచరించి ఆయా శివాలయాలను సందర్శించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివున్ని దర్శించుకొని దేవాలయాల్లో దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.


నూతనకల్‌లో పూజలు చేస్తున్న భక్తులు

కనుల పండువగా శాంతి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భానుపురి : కార్తీక మాసం చివరి సోమవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి ఆలయంలో శాంతి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు వలివేటి వీరభద్ర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ శాంతి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణరావు, సహాయ అర్చకులు సాగర్ శర్మ, సిబ్బంది సతీష్, శివస్వాములు పాల్గొన్నారు.

పురాతన ఆలయాల పరిరక్షణకు కృషి


ఆత్మకూరు(ఎస్) : ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి


భానుపురి : ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న కళా వేదిక సభ్యులు


సూర్యాపేట : ఐశ్వర్యకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్) : పురాతన ఆలయాల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏనుబాముల శివారులో ఉన్న పురాతన శివాలయాన్ని ఆయన సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి చేయాల్సిన పనులను గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మీరా, వర్రె నాగయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

భానుపురి : ఘంటసాల 171వ జయంతిని పురస్కరించుకొని సూర్యాపేట పట్టణంలోని కిరాణా ఫ్యాన్సీ అసోసియేషన్ భవనంలో నిర్వహించే గంటసాల స్వర వీరాజనం కార్యక్రమానికి రావాలని విజ్ఞాన సరస్వతి సాంస్కృతిక కళా వేదిక సభ్యులు సోమవారం ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో జగదీష్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో కళావేదిక జిల్లా అధ్యక్షుడు, జూనియర్ ఘంటసాల బుర్రి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుండా రమేష్, సరిత, నాగలక్ష్మి, నక్క శ్రీను పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే చేయూత

సూర్యాపేట : ఉన్నత చదువులకు ఆటంకంగా మారిన ఆర్థిక పరిస్థితులతో దిక్కుతోచని స్థితిలో ఉన్న గిరిజన నిరుపేద విద్యార్థినికి మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యుడు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అండగా నిలిచారు. పెన్‌పహాడ్ మండలం లాల్ సింగ్ తాండాకు చెందిన బానోతు ఐశ్వర్య చిన్ననాటి నుంచి చదువులో మంచి ప్రతిభను కనబరుస్తోంది. బీఎస్సీ నర్సింగ్‌కు గాను ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. కానీ ఐశ్వర్య పేద కుటుంబం కావడంతో చదువుకు ఖర్చులు భరించలేని స్థితిలో ఉంది. దీంతో అదే తండాలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కాకర్ల రమాదేవి ఆ విద్యార్థిని పరిస్థితిని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఐశ్వర్యను కుటుంబ సభ్యులతో సోమవారం సూర్యాపేటకు పిలిపించి ఆమె విద్య పూర్తయ్యే వరకూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వెంటనే కొంత ఆర్థికసాయం అందజేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన మామిడి రాములు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో సోమవారం అతడి మృతదేహానికి ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన బంటు రాజు కుమారుడు అనారోగ్యంతో మృతి చెందగా మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, మండాది నగేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, నకిరేకంటి భార్గవ్, మీసాల లింగయ్య, యగ్గడి మురళి, సైదులు, రాంబాబు, నాగయ్య, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డికి శుభాకాంక్షలు

భానుపురి : సూర్యాపేట నియోజకవర్గం నుంచి మూడవసారి శాసన సభ్యుడిగా ఎన్నికైన గుంటకండ్ల జగదీష్ రెడ్డిని జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ రాజు, బాలాజీ నాయక్, బోయాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : సూర్యాపేట ఎమ్మెల్యేగా గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించడంతో సోమవారం జాజిరెడ్డిగూడెం జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ సూర్యాపేట క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లెట్లపల్లి శోభన్ బాబు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట కోతను అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

చివ్వెంల : తమ పొలంలో వరి పంటను కోయనీయకుండా అడ్డుపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల పరిధిలోని ఐలాపురం గ్రామానికి చెందిన నక్క వెంకన్న, అతడి కుటుంబ సభ్యులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన నక్క వీరస్వామి అతడి కుటుంబ సభ్యులు గత కొద్ది రోజులుగా అకారణంగా తమ పొలంలోని వరిపంటను కోయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకన్న, కౌసల్య, లింగరాజు, శివరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై ఎస్‌ఐ విష్ణుమూర్తిని వివరణ కోరగా సివిల్ పంచాయతీ కావడంతో తాము ఏమీ చేయలేమని తెలిపినట్లు పేర్కొన్నారు.

గంజాయి రహిత కోదాడే లక్ష్యం

కోదాడ : కోదాడ పట్టణంలో గత ఐదు సంవత్సరాలుగా పాతుకుపోయిన గంజాయి దందాను కూకటి వేళ్లతో పెకిలించి వేస్తానని, గంజాయి రహిత కోదాడే తన లక్ష్యమని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు నీతి, అవినీతి మధ్య జరిగాయని, ప్రజలు నీతి వైపే నిలిచారన్నారు. కోదాడలో గంజాయిని నిషేధించాలని ఇప్పటికే పోలీస్ అధికారులతో మాట్లాడానని, సరిహద్దులో నిఘా పెంచడంతో పాటు పట్టణంలో సరఫరాపై కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, పోలీసులు తమ విధులను నిజాయితీగా చేయాలని, తమ నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండదన్నారు. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, వంగవేటి రామారావు, లక్ష్మీనారాయణరెడ్డి, ఏర్నేని బాబు, అల్తాఫ్ హుస్సేన్, పాండురంగారావు, సంతోష్‌రెడ్డి, బషీర్, జబ్బార్ పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి కృషి

మోతె : రావిపహాడ్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పందిళ్లపల్లి పుల్లారావు అన్నారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధుల కింద మంజూరైన ఐదు లక్షల రూపాయలతో మండలంలోని రావిపహాడ్‌లో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్యామలేని కోటేష్, నాయకులు తండు సతీష్, కోట మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు


తంగెళ్లగూడెం శివారులోని మూలమలుపు


సీతమ్మతండా శివారులో..

- సూచిక బోర్డుల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనం కనిపించకుండా మూలమలుపులు ఉండటంతో వాహనదారులు భయం భయంగా వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలోని అనంతారం క్రాస్ రోడ్డులో మూలమలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. అన్నారం రోడ్డులో, పెన్‌పహాడ్ శివారులోని దుబ్బతండా రోడ్డులో, సింగారెడ్డిపాలెం శివారులో ఉన్న మూలమలుపులు ప్రమాదాలకు నెలవుగా మారాయి. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో భయం భయంగా వాహనాలు నడపాల్సి వస్తోందని వాహనదారులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదాలను నివారించాలి



మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి. ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం చేయొద్దు. మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడంలేదు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలి.

– గద్దల నవీన్, అనంతారం, వాహనదారుడు

బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే షురూ


అడివెంలలో సర్వే చేస్తున్న సీఆర్‌పీ వెంకట్‌రెడ్డి

అర్వపల్లి : బడి బయట ఉండే, మధ్యలోనే చదువు మానేసిన పిల్లలను గుర్తించేందుకు తిమ్మాపురం కాంప్లెక్స్ పరిధిలోని అడివెంలలో సీఆర్‌పీ రామిడి వెంకట్‌రెడ్డి సోమవారం ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు సర్వే ఉంటుందని చెప్పారు. ఈ సర్వేలో 28 అంశాలతో కూడిన సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ప్రబంధు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రెండు నెలలుగా విద్యుత్ బిల్లులు బకాయి


అర్వపల్లిలో అంధకారంలో ఉన్న హైవే

అర్వపల్లి : అర్వపల్లిలో హైవేపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ బిల్లులు రెండు నెలలుగా బకాయి పడటంతో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో అర్వపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు హైవేతో పాటు స్థానిక వైజంక్షన్ అంధకారంగా మారింది. ఈ విషయమై హైవే అధికారులు మాట్లాడుతూ 365బీ హైవే కాంట్రాక్ట్ గడువు ముగిసినందున రెండు నెలల నుంచి విద్యుత్ బిల్లులను గ్రామ పంచాయతీ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఇక నుంచి గ్రామ పంచాయతీ వారే సెంట్రల్ లైటింగ్ విద్యుత్ వాడకం బిల్లు చెల్లించాలని తెలిపారు.